www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 21 మార్చి 2024
5
తూర్పుగోదావరి



## ఉండ్రాజవరంలో భారీ వర్షం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉపరితల ద్రోణితో బుధవారం మండలంలో పలుచోట్ల వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వరి చేలు ఈనిక దశలో ఉండటంతో దోమపోటు వాటిల్లే ప్రమాదం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


# స్థానచలనం కలిసొచ్చేనా?

- ఆరు స్థానాలలో అభ్యర్థుల మార్పు
- తెరలేపిన అధికార, విపక్ష పార్టీలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

'కుడిఎడమైతే పొరపాటు లేదోయ్' అన్నారు ఓ సినీ కవి. అయితే రాజకీయ రంగంలో ఇది ఏ మేరకు సత్ఫలితాలు వస్తాయో అనే భయం అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. అధికార వైసిపి జిల్లాలో నాలుగు స్థానాల్లో అభ్యర్థులకు స్థాన చలనం కల్పించగా, టిడిపి, జనసేన, బిజెపి కూటమి రెండు అసెంబ్లీ స్థానాల్లో మార్పునకు తెరలేపింది. సామాజిక సమీకరణలతో పాటు, అభ్యర్థుల బలాబలాలను అంచనాలు వేసి 2024 ఎన్నికల్లోవిజయమే లక్ష్యంగా మార్పులు చేసినట్లు ఆయా పార్టీల ముఖ్యనేతలు చెబుతున్నారు. అయితే ఈ మార్పు జిల్లా ఓటర్లను ఏ మేరకు ప్రభావితం చేస్తుందో వేచి చూడాలి. వైసిపి జిల్లాలోని ఏడు సీట్లతో పాటు ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన విషయం విధితమే. అదే విధంగా ప్రతిపక్ష తేదేపా -జనసేన-బిజేపీ కూటమి ఏడు అసెంబ్లీ స్థానాలను ప్రకటించింది. ఎంపి అభ్యర్థిని ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసింది. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదల కావటంతో అసెంబ్లీ స్థానాల్లో జోరుగా ప్రచారం మొదలైంది.

వైసిపిలో నిడదవోలు, అనపర్తి, రాజానగరంలో మాత్రమే సిట్టింగ్‌లకు అవకాశం లభించింది. మిగిలిన నాలుగు నియోజక వర్గాల్లో మార్పులు తప్పలేదు. 2019లో రాజమహేంద్రవరం ఎంపీగా గెలుపొందిన మార్గాని భరత్‌రామ్ రాజమహేంద్రవరం అసెంబ్లీ స్థానంలో పోటీ చేసేందుకు సిద్ధం అయ్యారు. అయితే రాజమహేంద్రవరంలో కీలక నేతలు నుంచి తాజాగా ప్రతిఘటన రావటంతో అధినేత ఏ మేరకు సమన్వయం చేస్తారో వేచి చూడాలి. ఈ స్థానంలో టిడిపిని ఎదుర్కొవాలంటే కత్తిమీద సామేనని విశ్లేషకులు అంటున్నారు. సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన గోపాలకృష్ణ రాజమహేంద్రవరం రూరల్ బరిలో నిలిచారు. వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్‌గా గతంలో పనిచేసిన చందన నాగేశ్వర్ ఈ స్థానంలో పోటీ చేసేందుకు ఆశించి భంగ పడ్డారు. అధినేత నిర్ణయంతో తొలుత కొంత నిరుత్సాహానికి గురైనా ప్రస్తుతం క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. అయితే ఆయన వర్గం ఏ మేరకు కలిసి వస్తుందో వేచి చూడాల్సి ఉంది. మరోవైపు కొవ్వూరులో గెలుపొందిన హోం మంత్రి తానేటి వనితకు ఈ సారి గోపాలపురం నియోజక వర్గం నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం అయ్యారు. గోపాలపురంలో గతంలో టిడిపి నుంచి ఆమె పోటీ చేసి గెలుపొందారు. ఈ నియోజక వర్గంలో స్థానిక వైసిపి నేతలతో సమన్వయం ఆమెకు సవాలుగా మారింది. స్వపక్షంలో విపక్షం అనే విమర్శలు సైతం విన్పిస్తున్నాయి. గత ఎన్నికల్లో గోపాలపురం నియోజక వర్గంలో గెలుపొందిన తలారి వెంకట్రావుకూ స్థాన చలనం తప్పలేదు. అధినేత ఆదేశాలతో కొవ్వూరు నియోజక వర్గం నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం అయ్యారు. ప్రతిపక్ష టిడిపి, జనసేన, బిజెపి కూటమిలోనూ స్థాన చలనాలు తప్పలేదు. రాజమహేంద్రవరం రూరల్ బరిలో పోటీ చేసేందుకు ఆసక్తి చూపించిన జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్‌కు నిరాశే మిగిలింది. గత ఏడాది ఇదే స్థానంలో ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరికి గట్టిపోటీ ఇచ్చారు. జనసేన అధినేత ఆదేశాలతో ఈ సారి నిడదవోలు నియోజక వర్గం నుంచి ఆయన బరిలో ఉన్నారు. ఈ నియోజక వర్గంలో టిడిపి నేత బూరుగుపల్లి శేషారావు 2009, 2014లో వరుసగా రెండు సార్లు విజయం సాధించారు. టిడిపి సీనియర్ నేత కుందుల సత్యనారాయణ సీటు కావాలని పట్టుబట్టారు. తాజాగా జనసేనకు కేటాయించడంతో ఇరువురికీ నిరాశే మిగిలింది. అయితే ఈ నియోజక వర్గంలో జనసేనకు ఏ మేరకు సహకరిస్తారో వేచి చూడాలి. 2014 గోపాలపురం ఎంఎల్ఎగా గెలుపొందిన ముప్పిడి వెంకటేశ్వరరావును తాజాగా కొవ్వూరు నుంచి టిడిపి బరిలో నిలిపింది. మాజీ మంత్రి జవహర్ స్వతంత్ర అభ్యర్థిగా నిలబడితే గెలుపు కష్టమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ స్థానచలనాలు ఎవరికి గెలుపును అందిస్తాయో, ఎవరికి ఓటమిని అందిస్తాయో వేచి చూడాలి.




## సెంటర్ లైటింగ్ తొలగింపుపై సమాధానం చెప్పాలి

### ఏర్పాటుకు అయిన ఖర్చును రికవరీ చేయాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం నగర

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతుంది, ఈ పనులు నిర్వహించే సందర్భంలో కనీసమైన ముందుచూపు లేకుండా వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. నగరంలో మెయిన్ రోడ్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు సెంటర్ లైటింగ్ పెట్టారన్నారు. సెంటర్ లైటింగ్‌పై ఇబ్బందులు వస్తాయని ఆ ప్రాంతంలోని ప్రజలు, వ్యాపారవేత్తలు అభ్యంతరాలు చెప్పారన్నారు. కానీ వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఆదేశాలతో సెంటర్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆరు నెలలు తిరగకుండానే ఆ సెంటర్ లైటింగ్‌ను తొలగించారన్నారు. సెంటర్ లైటింగ్ ఎందుకు పెట్టారు? ఎందుకు తొలగించారని? అరుణ్ మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. నగరపాలక సంస్థ ఆ సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి అవసరమైన డబ్బులను నగర ప్రజలపై వేసిన ఇంటి పన్ను, చెత్త పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, ప్రొఫెషనల్ టాక్స్, వినోదపు పన్ను వంటి వాటి ద్వారా వసూలు చేసినవే అని గుర్తు చేశారు. అధికారులు ఇష్టానుసారం ఖర్చుచేసి, జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు అయిన ఖర్చును ముందు చూపు లేకుండా నిర్ణయాలు చేసిన అధికారులు, వారికి సలహాలు ఇచ్చిన వారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థకు పాలకవర్గం లేని సమయంలో అఖిలపక్షం వేసి సలహాలు సూచనలు తీసుకునే సంప్రదాయాన్ని ప్రస్తుత అధికారులు విస్మరించారన్నారు. కావున వృథా అయిన ఖర్చును రికవరీ చేయాలని, ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్, నగర కార్యదర్శి పవన్

## ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగానికి చెందిన 70 మంది విద్యార్థులు బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌కి క్షేత్ర పర్యటనకు బయలుదేరారు. ఈనెల 20 నుంచి 23వరకూ వారు ఈ పర్యటనలో ఉంటారని ప్రిన్సిపల్ డా.రామచంద్ర తెలిపారు. దేశంలోనే అత్యున్నతమైన పరిశోధనా కేంద్రానికి విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లడం అభినందీయమన్నారు. ఇలాంటి క్షేత్ర పర్యటనలు శాస్త్రీయ దక్పథాన్ని, పరిశోధనా జిజ్ఞాసను పెంచుకునేందుకు సహకరిస్తాయన్నారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిభావంతమైన శాస్త్రవేత్తల నుంచి, వారి పరిశోధనల నుంచి విజ్ఞానాన్ని సంగ్రహించాలని తెలిపారు. ఈ పర్యటనకు రసాయన శాస్త్ర విభాగం నుంచి జాకబ్, శ్రీధర్, సురేష్, మల్లికార్జున, త్రినాథ్, సురేఖ, శాంత కుమారి, భార్గవి, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుబిధ ద్వారా అనుమతులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వివిధ రకాల అనుమతులను పొందాల్సి ఉంటుందని, దీని కోసం సుబిధ యాప్‌ను రూపొందించారని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. అభ్యర్థులు ఈ యాప్‌ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో డిఆర్ఒ జి.నరసింహులు, రాజమండ్రి పార్లమెంటు ఎఆర్ఒ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన దృష్ట్యా ఫారం 7, 8లను స్వీకరించడం నిలుపుదల చేశామన్నారు. నామినేషన్లు స్వీకరించే చివరి రోజు వరకు అనగా ఏప్రిల్ 25 వరకు ఫారం 6ను స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నోటిఫికేషన్ ఏప్రిల్ 18న జారీ చేస్తారన్నారు. 25 వరకు నామినేషన్లను స్వీకరించనున్నామన్నారు. ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుందన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఏప్రిల్ 29తో ముగుస్తుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహిస్తారన్నారు. జూన్ 6వ తేదీతో ఎన్నికలు పూర్తి అవుతాయన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి అత్యంత కీలకం అన్నారు. ఎంసిఎంసి అమలు కోసం జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన ఏడు పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయిలో స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. రాజమండ్రి పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్.కృష్ణానాయక్ ఓటరు జాబితా, పెండింగు ఫారాలు, ఎంసిఎంసి నియమాలకు సంబంధించిన డాక్యుమెంట్లను అందజేశారు. అనంతరం సుబిధ యాప్ పనితీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. subidha.eci.gov.in పోర్టల్‌లో ఎన్నికల కమిషన్‌కు రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి వివిధ అనుమతుల కోసం ఈ 'సుబిధ' యాప్ రూపొందించారన్నారు. వివిధ అనుమతులు కోసం యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సంతకం చేసిన పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ నుంచి నలబాటి రమేష్, బిజెపి నుంచి పివి.లక్ష్మి, సిపిఎం నుంచి ఎస్ఎస్.మూర్తి, టిడిపి నుంచి సిహెచ్.శ్రీనివాసరావు, బిఎస్‌పి నుంచి జి.చిత్రసేను, ఆప్ నుంచి ఎన్.సుబ్రహ్మణ్యం, వైసిపి నుంచి కె.రాజశేఖర్, ఎలక్షన్స్ డిటి ఎం.సునీల్‌కుమార్, తులసి తదితరులు పాల్గొన్నారు

## పరీక్షకు 96 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - చాగల్లు, తాళ్లపూడి

బుధవారం చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో జరిగిన పదోతరగతి పరీక్షకు 96 మంది గైర్హాజరయ్యారు. చాగల్లులో 33 మంది, తాళ్లపూడిలో 63 మంది విద్యార్థులు హాజరుకాలేదని ఎంఇఒలు తెలిపారు. డిఇఒ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేశారు.

## గెడ్డం శివకు ఎంఎల్ఎ గోరంట్ల పరామర్శ

ప్రజాశక్తి-కడియం


ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్, చిరు సేవా సమితి అధ్యక్షులు గెడ్డం శివను ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం పరామర్శించారు. ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శివను ఆయన స్థానిక టిడిపి నాయకులు వెలుగుబంటి నాని, మార్గాని సత్యనారాయణతో కలిసి పరామర్శించారు. శివ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - చాగల్లు

బిసిలకు అధిక సీట్లు కేటాయించిన వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డికి బిసి సంక్షేమ సంఘం అఖిలభారత అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. చాగల్లులో బుధవారం బిసి సంఘం నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొన్నారు. బిసి నాయకులు సిహెచ్.దుర్గమల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. పూలే ఆశయ సాధనకు జగన్ కృషి చేస్తున్నారన్నారు.

## కార్టూ'నిజం'




# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధాన్యం కొనుగోళ్లను పారదర్శంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2023-24 రబీ సీజన్లో ధాన్యం సేకరణపై రెవెన్యూ, పౌర సరఫరాల, వ్యవసాయ, సహకార, తూనికలు కొలతలు, రవాణా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, స్టాక్ హోల్డర్స్, కస్టోడియన్ అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలుకు ఆర్‌బికెలను సిద్ధం చేయాలన్నారు. ఏప్రిల్ 1నాటికి 231 కోనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 6 హెక్టార్లలో కోతలు పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఇబ్బందులు లేవని వ్యవసాయ అధికారులు తెలిపారన్నారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ కచ్చితంగా పాటించడం ముఖ్యమన్నారు. ఇప్పటి వరకు 4 సీజన్లలో సీకరండ్స్ చేపట్టామని,ప్రస్తుతం 5వ సీజన్ కొనుగోలుకు సంబంధించి అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులు, ధాన్యం సేకరణ పనులని సమాంతరంగా నిర్వర్తించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల విధి నిర్వహణ చట్టబద్ధత కలిగి ఉంటుందని, మరో పక్క రైతుల నుంచి ధాన్యం సేకరణ నిబద్ధత కలిగి ఉంటుందన్నారు. మిల్లర్లు, అధికారుల మధ్య అనుసంధానం అత్యంత కీలకం అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

అనంతరం జెసి తేజ్ భరత్ మాట్లాడుతూ జిల్లాలో 2023-24 రబీలో 57,313 మంది రైతులు 1,32,159 ఎకరాల్లో వరి పంట ఈ-క్రాప్ కింద నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం 18 మండల స్థాయి సేకరణ కమిటీల ద్వారా 142 మిల్లులను గుర్తించి, వాటికి కస్టోడియన్ అధికారుల నియమించామన్నారు. సేకరణ లక్ష్యాలను సాధించడం కోసం 2,310 మంది హామీలీలు, 355 వాహనాలను సిద్ధం చేశామన్నారు. మిల్లర్లు ద్వారా బ్యాంక్ గ్యారంటీకి సంబంధించిన పనులన్నీ సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. కోనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు ర్యండమైజేషన్ ద్వారా చేపట్టాలన్నారు. ఏప్రిల్ 1 నాటికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలన్నారు. మొబైల్ టీమ్స్ ద్వారా కొనుగోళ్ల పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆసుతోష్ శ్రీవాత్సవ, పౌర సరఫరాల డిఎం శ్రీదేవి, డిఎస్ఒ విజయ భాస్కర్, డిఎఒ ఎస్.మాధవరావు, పాల్గొన్నారు.



తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

## కాటవరంలో మైనింగ్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సీతానగరం మండలం చిన్న కొండేపూడికి చెందిన పర్యావరణవేత్త చిడిపి నకుల సురేష్ ఫిర్యాదు మేరకు మైనిగింగ్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. సీతానగరం-రాజమహేంద్రవరం రహదారి నిర్మాణ పనులను చేస్తున్న విశ్వతేజ కన్‌స్ట్రక్షన్ కంపెనీతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయివేటు లే-అవుట్ల పూడిక కోసం గ్రావెల్‌ను అక్రమంగా తల్లి తరలిస్తున్నారు. ఆయన కలెక్టర్‌కు, జిల్లా మైనింగ్ అధికారులకు, ఆర్ అండ్ బి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం సీతానగరం మండలం కాటవరం గ్రామంలో 239/1 సర్వే నెంబర్‌లో 94 ఎకరాలకు సంబంధించిన కొండను జిల్లా మైన్స్ అధికారులు ఆర్ఐ జ్యోతి, సర్వేయర్ అజిత, రెవెన్యూ అధికారులు, విఆర్ఒ కుమారి, సచివాలయ సర్వేయర్లు ఫిర్యాదుదారు చిడిపి నకుల సురేష్‌తో కలిసి తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్రమాలపై సాక్ష్యాధారాలను గ్రీన్ ట్రిబ్యునల్ కు అందించానని సురేష్ తెలిపారు.

## డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

డిజిటల్ అక్షరాస్యత, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎన్ విష్ణువర్ధన్ తెలిపారు. బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చివటం గ్రామంలో సోమవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్న ప్రత్యేక శిబిరం లో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చివటం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు డిజిటల్ అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మొబైల్, ఇంటర్నెట్, డెబిట్ కార్డులు, సోషల్ మీడియా వంటివి వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు టీములుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. సెల్ ఫోనులో తెలియని లింక్‌లను క్లిక్ చేయరాదని తెలిపారు. ఒటిపిలు, డెబిట్ కార్డు పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోరాదన్నారు. సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో సున్నితమైన సమాచారాన్ని, ఫోటోలను పంచుకోరాదన్నారు. ఒకవేళ సైబర్ నేరాలకు గురైతే హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని వివరించారు. శుక్రవారం గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు విష్ణువర్ధన్ తెలిపారు. గ్రామంలో కంటి సమస్యలు ఉన్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రేమ్ ప్రసన్న, ఎం.శ్రీలత, ఎం.బాబి, కె.ధనలక్ష్మి, బి.శ్రీనివాసు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

## 'మద్దిపాటి' మహాసంకల్ప పాదయాత్ర

ప్రజాశక్తి- గోపాలపురం

కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు గౌరీపట్నం మేరీ మాత గుడి నుంచి ద్వారకాతిరుమల ఆలయం వరకూ చేపట్టిన మహా సంకల్ప యాత్రను బుధవారం ప్రారంభించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి యాత్రలో పాల్గొన్నారు. నాలుగు రోజులపాటు 27 గ్రామాల్లో 80 కిలోమీటర్ల మేర పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. మండలంలోని చెరుకుమిల్లి, చిట్యాల, పెద్దాపురం, వేల చింతలగూడెం, గోపాలపురం, మీదుగా వాదాలకుంట చేరుకున్నారు. అక్కడనుండి వెదుళ్లకుంట, యాదవోలు మీదుగా యాత్ర సాగుతుందని తెలిపారు. ఈ యాత్రలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కోలాహలంగా జనార్ధనస్వామి రథోత్సవం

ప్రజాశక్తి- కడియం

కడియంలో జనార్ధనస్వామి రథోత్సవం బుధవారం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథం తాడు లాగి మొక్కుబడి తీర్చుకున్నారు. కడియం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, దేవాలయం చైర్మన్లు ఆర్ఎస్.ఎన్. మూర్తి, బండారు శ్రీను పాల్గొన్నారు.

## రంపయర్రంపాలెం రాంజీ ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెంలో తోట నరసింహం తనయుడు తోట రాంజీ ప్రచారం నిర్వహించారు. ఈ గ్రామ ప్రజలతో తమ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఐదేళ్లలో గ్రామంలో సంక్షేమం, అభివృద్ధికి కార్యక్రమాలను ఎన్నో చేపట్టారన్నారు. ఓట్లు అభ్యర్థించడానికి వచ్చిన తోట రాంజీకి స్థానిక మహిళలు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 3వ డివిజన్‌లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

రాజమహేంద్రవరం రూరల్ : నగరంలోని 3వ డివిజన్‌లో బుధవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. డివిజన్‌లోని ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. జగన్ ప్రభుత్వం అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఎంఎల్ఎగా పోటీ చేస్తున్న తన అభ్యర్థిత్వాన్ని బలపరిస్తే రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి రాంబాబు, మరుకుర్తి రవి యాదవ్, అహ్మదున్నీషా పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదలైనందున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు అనుమతులను తీసుకోవాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి అధికారులు, రాజకీయ నాయకులు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రవర్తన నియమావళి పరిధిలోకి వస్తారన్నారు. రాజకీయ ప్రతినిధులు, ఎవరైనా పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్స్, హోమ్ టు హోమ్ ప్రచారం, సమావేశాలు, సభలు, వాహనాల ద్వారా ప్రచారం వంటివి నిర్వహణకు సంబంధిత నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. అధికారులు ఎవరూ పొలిటికల్ పార్టీలతో అనుసంధానం ఉండరాదని, వారు నిర్వహించే సమావేశాలకు హాజరు కాకూడదన్నారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు, రేడియో, సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్, డిజిటల్ బోర్డుల్లో ప్రకటనలు ఇవ్వాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఆటోలు, బస్సులు తదితర ప్రజా రవాణా వాహనాల్లో కూడా అనుమతి లేకుండా రాజకీయ పార్టీల స్టిక్కర్లు, బ్యానర్లు పెట్టకూడదని స్పష్టం చేశారు. పేపర్లలో ప్రకటనలు ఇవ్వడానికి ముందస్తు అనుమతి అక్కరలేదని, పెయిడ్ న్యూస్‌ను అభ్యర్థుల ఖాతాలో ఖర్చుగా జమేస్తామన్నారు. మైకులు, ప్రచార వాహనాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, అభ్యర్థుల ప్రచారానికి ముందస్తు అనుమతిని వివిధ స్థాయిల్లో తీసుకోవాలని చెప్పారు. సింగిల్ విండో విధానంలో, రిటర్నింగ్ అధికారుల ద్వారా అన్ని రకాల అనుమతులు మంజూరు చేస్తారన్నారు. వీలైనంత వరకు సుబిధ యాప్ ద్వారా అనుమతులకు ధరఖాస్తు చేయాలని కోరారు. ఇప్పటికే జరుగుతున్న అభివద్ధి పనులు కొనసాగుతాయని, కొత్తగా పనులు మంజూరు చేయడం జరగదని అన్నారు.

జిల్లాలో మొత్తం 1,577 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని అన్ని పోలింగు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, అన్ని వసతులును కల్పించి సిద్ధం చేశామన్నారు. ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులు ఉండవని, వాటికోసం వచ్చే ధరఖాస్తులను పరిశీలించబోమన్నారు. జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడానికి ఫారం 6 ద్వారా 18 నుంచి 21 ఏళ్ల మధ్య ఉన్న వారికి, ఫారం - 8 ద్వారా ఒక చోట నుంచి మరో చోటకి ఓటు బదిలీకి మాత్రం అవకాశం ఉందని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

# నేరాలు ఘోరాలు

## సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- కడియం

కడియం సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బి.ఎన్.దుర్గాప్రసాద్, టి.కృష్ణసాయి సిబ్బందితో కలిసి మండలంలోని దుళ్లలో వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం దాడులు నిర్వహించి సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. వేములూరు వెంకట్రావు, కళ్లెం కాంతారావులను అరెస్టు చేసి వారి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరపరిచినట్లు ఆయన తెలిపారు.

## 5 డొమెస్టిక్ సిలెండర్లు స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పట్టణంలోని నారాయణపురంలో బుధవారం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు నిర్వహించారు. 'రుచి కర్రీ పాయింట్ అండ్ కేటరింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్న ఐదు డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. యజమాని ఎన్.సుబ్బలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి శ్రీనివాసరెడ్డి,

## అదుపు తప్పిన కారు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం రాజావైరి గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యానాం నుండి కోటిపల్లి వైపు వస్తున్న కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. అయితే ఇక్కడ గ్రామస్తులు ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ ను ఢీకొనడంతో కాల్వ చివరికి వెళ్లి ప్రమాదం నుండి బయటపడ్డారు. అయితే గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను సిమెంట్ పోల్స్ ఈ ప్రమాదంలో ధ్వంసమైంది. దీంతో గ్రామస్తులుకారును బయటకు తీశారు. కారు యజమానిని దెబ్బతిన్న ఫ్రెన్సింగ్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## చోరీ కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఇంటిలో ఎవరూ లేని సమయం లో ఇంటిలో కి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు నగలు దొంగిలించిన వ్యక్తికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 12న మండలంలోని ర్యాలీ గ్రామంలో చెందిన మిద్దె భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు . మరుసటి రోజు ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. వారు గదిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉండవలసిన 32 గ్రాముల బంగారం వస్తువులు లేకపోవడంతో.. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని భావించిన భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కసు నమోదు చేసిన ఎస్ఐ ఎస్.శ్రీనివాసు దర్యాప్తును వేగవంతం చేశారు. గ్రామానికి చెందిన వెంకటాపు పల్లపురాజుని అనుమానితునిగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించి అతని వద్ద నుంచి 32 గ్రాముల బంగారం రికవరీ చేసి కొత్తపేట జెఎఫ్‌సిఎం కోర్టులో హాజరు పరిచారు. నిందితునికి వెంకటాపు పల్లపురాజుకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## రైలు ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట అయిదు తూముల సమీపంలోని సమీపంలో అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద పిఠాపురం ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం స్థానికులు గుర్తించారు. ఈ మృతదేహం రెండుగా చీలిపోయి ఉండడంతో, ఆత్మహత్య లేక రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదం తెల్లవారుజామున జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కాగా స్థానికులు ఈ మృతదేహం సమాచారం ను సామర్లకోట రైల్వే స్టేషన్ ఆర్‌పిఎఫ్ పోలీసులకు వివరాలు అందజేశారు. కాగా మృతుని వివరాలు, మృతికి కారణం పూర్తిగా తెలియాల్సి ఉంది.

## సారా కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సారాను విక్రయించేందుకు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా అతనికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సారాను నిర్మూలించేందుకు డిఎస్‌పి కెవి.రమణ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ శ్రీ రామ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఐ యస్. శ్రీనివాసు తను సిబ్బందితో మండలం గ్రామాలలో సారా స్థావరాలపై విస్తత దాడులు నిర్వహించారు ఈ దాడుల్లో పేరవరం గ్రామ శివారులో సారా తరలిస్తున్న గ్రామానికి చెందిన పాములు సత్తిబాబు ను అదుపులోకి తీసుకుని అతను వద్దనుంచి10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి , కొత్తపేట కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

# వాలంటీర్లతో ఎంపీ భరత్ చీకటి ఒప్పందాలు

## ఆధారాలతో ఫిర్యాదు చేశాం
## మీడియా సమావేశంలో ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తనపై ఎలాగైనా విజయం సాధించాలని పగటి కలలు కంటున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్ వాలంటీర్లతో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాడని టిడిపి రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం దేవీచౌక్ సెంటర్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. వాలంటీర్లతో సమావేశాలు నిర్వహించి వారిని ప్రలోభాలకు గురి చేస్తున్న చిత్రాలను ఆధారాలతో పాటు రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని వివరించారు. అసలు రాజమండ్రిలో 2 రోజులుగా ఏం జరుగుతోందని ప్రశ్నించారు. అధికారులకు ఈ విషయం తెలియదా..? లేదా తెలిసి కూడా, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా..? అని ప్రశ్నించారు. భరత్ రామ్ నగరంలోని వార్డు వాలంటీర్లతో ఒక్కొక్కరితో సమావేశం



నిర్వహిస్తూ వాళ్లకు లేనిపోని ఆశలు కల్పించి, వాలంటీర్ పదవికి రాజీనామా చేసి, వచ్చే ఎన్నికల్లో తన తరపున బూత్ ఏజెంట్లుగా పని చేయాలని, అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల పట్టాలు ఇప్పిస్తా, ఆర్థికంగా ఆదుకుంటానంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. వాలంటీర్ల జీవితాలతో ఆటలాడుకోవడం, రాజీనామా చేయాలనడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలన్నారు. వచ్చే 50 రోజుల్లో వైసిపి ప్రభుత్వం కుప్పకూలుతుందని, అప్పుడు వారిని ఎలా ఆదుకుంటావని ఎంపీని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామన్నారు. వారందరికీ మెరుగైన వేతనం ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారు. వాలంటీర్లతో రహస్య మీటింగ్ వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఎలక్షన్ కమిషన్‌కు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేస్తామన్నారు. కల్చరల్ హబ్‌గా ఉన్న నగరాన్ని మార్గాని భరత్‌రామ్ క్రైమ్ హబ్‌గా మార్చేశాడని ఆరోపించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను వెంట తిప్పుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆయన వెంట టిడిపి నగర కమిటీ ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ద్వారా పార్వతిసుందరి, కార్యదర్శి లాల్ ఖాన్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీవరప్రసాద్, యువ నాయకులు యిన్నమూరి ప్రదీప్, బీసీ సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు తదితరులున్నారు.



## ఎఫ్‌ఒబికి గడ్డర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరంలోని మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో అత్యంత ప్రధాన ఘట్టం కుడి, ఎడమ వంతెనలను అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసే గడ్డర్లను బుధవారం రాత్రి అమర్చారు. భారీ వాహనాలపై గడ్డర్లను బ్రిడ్జి నిర్మాణ స్థలానికి తీసుకొచ్చి క్రేన్ల సహాయంతో గడ్డర్లను అమర్చారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ గడ్డర్ల ఏర్పాటు సమయంలో అక్కడే ఉండి పర్యవేక్షించారు. విశాఖ, విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశారు.

## ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించాలని ఇఆర్ఒ లక్ష్మీశివజ్యోతి కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషనర్ ఆదేశాలు పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలుపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ ప్రజాప్రతినిధులు సహకరించాలని అన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 248 పోలింగ్ బూత్‌లకు ఒక్కొక్క, బూత్‌లో పిఒ, నలుగురు సిబ్బంది. ఉంటారన్నారు. నియోజకవర్గంలో 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించామన్నారు. 57 సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించామన్నారు. గోపాలపురంలో 9, దేవరపల్లిలో 12, నల్లజర్లలో 17, ద్వారకాతిరుమలలో 19 ఉన్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశాలు, ర్యాలీలకు



అనుమతులు తీసుకోవాలన్నారు. వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చే ప్రలోభాలకు లొంగకుండా ఉండాలన్నారు. పార్టీల తరుపున ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జగన్నాథపురం, నల్లజర్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 15వ తేదీ నాటికి కొత్త ఓట్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వనజాక్షి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి - పెరవలి

మండలం ఖండవల్లిలో పోతిరాజు గుడి వీధి శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నూతన సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన బుధవారం జరిగిదంఇ. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు, ఆయన తనయుడు జి.వరుణ్‌సాయి, జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి కందుల దుర్గేష్, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, మండల అధ్యక్షులు వీరమల్లు సత్యనారాయణ, రామడుగుల సూర్యనారాయణ ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ప్రతిష్టాపన సందర్భంగా 6వేల మందికి అన్నదానం చేశారు.



## కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

బుధవారం కోడిపందాలు నిర్వహిస్తున్నారని సీతానగరం ఎస్సై రామకృష్ణకు అందిన సమాచారం మేరకు అచ్చియ్యపాలెం గ్రామ శివారు తోటల్లో దాడులు చేశారు. ఈ దాడుల్లో కోడిపందాలు ఆడుతున్న 6 గురు వ్యక్తులను, 2 కోడి కత్తులను, 2 కోడి పుంజులను పోలీసులు పట్టుకున్నారు. 1280 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎన్నికల్లో నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలపై కఠినమైన చర్యలు చేపడతామని అన్నారు.

## 'మద్దిపాటి'ని మార్చాలని డిమాండ్

ప్రజాశక్తి - నల్లజర్ల

గోపాలపురం నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా మద్దిపాటి వెంకటరాజును అధిష్టానం ఇటీవల విడుదల చేసిన రెండో లిస్టులో ప్రకటించింది. దీనిపై బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 100 మంది వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు మద్దిపాటి అభ్యర్థత్వాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ప్రియాంక కళ్యాణ మండపం వద్ద సమావేశమయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరోనా కష్టకాలంలో పార్టీని ముందుండి నడిపించిన ముప్పిడికైనా మరొకరికైనా టికెట్ ఇస్తే గెలిపిస్తామన్నారు. వారంలోపు అధిష్టానం సమన్వయకర్తలను పంపి నియోజవర్గంలో రెండు వర్గాల నాయకుల మధ్య సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముల్లపూడి బాపిరాజు హాజరు కాలేదు. ఈ కార్యక్రమంలో ఏలేటి సత్యనారాయణ(జెడి), గుదే వెంకట సుబ్బారావు, అల్లాడ రాజారావు, రావూరి వెంకటరమణ. సవలం రామకృష్ణ, కొట్టూరు గాంధి, అనంతలక్ష్మి, సంకు శ్రీనివాసరావు. ప్రగడ శ్రీనివాసరావు. తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద ఆయా విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. యానాం రీజెన్సీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ కార్యక్రమాలలో భాగంగా బుధవారం వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాలలో 'మహిళల విద్య- సాధికారత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో అధ్యాపకురాలు దుర్గాదేవి, దుర్గామణి మాట్లాడారు.







## కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

ప్రజాశక్తి-మండపేట

కులం పేరుతో దూషించారంటూ గొల్లపుంత టిడ్కో కాలనీకి చెందిన మీసాల దేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎ బ్లాక్లో ని ఇంటి మెయిన్ డోరును అదే బ్లాకులో ఉంటున్న బాలిక ఈనెల 10న పాడు చేసిందన్నారు. బాగు చేయించమని ఆమె తల్లిదండ్రులను అడగ్గా దిక్కున్న చోట చెప్పుకోవాలంటూ దూషించినట్లు తెలిపారు. 12న తన కుమారుడు సతీష్ మేడపైకి వెళు తుండగా కులం పేరుతో అవమానించారని ఫిర్యాదు చేశారు. బాలిక తల్లితోపాటు మరో అయిదుగురు మహిళలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు



## లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

**మండపేట** : లారీ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పులగుర్తకు చెందిన మానుపాటి సత్యనారాయణ కోళ్ల కొనుగోలుకు మంగళవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మారేడుబాక సెంటరు వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదలో సత్యనారాయణకు గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాచవరానికి చెందిన అమలదాసు అజయ్ ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎఎస్ఐ బి. వెంకటేశ్వరరావు తెలిపారు.

## 10 లీటర్ల సారా స్వాధీనం

**కపిలేశ్వరపురం** : మండలంలోని కేదార్లంక, వీధివారిలంకలోని లంక పొలాల్లో ఈనెల 19 నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు అంగర ఎస్ ఐ అందే పరదేశి తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ఇవి.. విశ్వనీయ సమాచారం మేరకు తన సిబ్బందితో దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన నిందితులు కరుపోతు ప్రసన్నకుమార్, పొద్దాక వెంకటవర్మలను అదుపులోకి తీసుకుని ఆలమూరు జెఎఫ్‌సిఎం కోర్టుకు తరలించమన్నారు. ఘటనా స్థలంలో డ్రమ్ములు, కట్టెల పొయ్యెలను ధ్వంసం చేశామని తెలిపారు.